క్లుప్తంగా

5న జాబ్‌మేళా

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఈనెల 5న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సదాశివపేటకు చెందిన ఎవరెస్టు ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ ఉద్యోగాల కోసం ఖాళీలున్నాయని, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93815 57831 నంబరులో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్ తెలిపారు. ఆరో తరగతి 100 సీట్లు ఉన్నాయని, అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 28లోగా దరఖాస్తులను సమర్పించాలని, ఏప్రిల్ 13న 6వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7 నుంచి 10వ తరగతికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంకిత భావంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

మిరుదొడ్డి(దుబ్బాక): అంకితభావంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తేనే మంచి సత్ఫలితాలు సాధ్యపడతాయని ఎంఈఓ ప్రవీణ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఫొటోలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీప్రపంచంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వర్ణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెరుమాండ్ల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, రాజేశ్వర్, జాషువా, స్రవంతి, సురేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సహకార నిధి డిపాజిట్ పథకం

సిద్దిపేటరూరల్: ఎనిమిదేళ్ల 9నెలలలో రెట్టింపయ్యే సహకారనిధి పాజిట్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్యాంక్ రాఘవాపూర్ బ్రాంచ్ మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి శనివారం పిలుపునిచ్చారు. అదేవిధంగా బంగారంపై అత్యధికంగా గ్రాముకు రూ.5,200 చొప్పున రుణాలు అందజేస్తున్నామని, సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై అత్యధికంగా 8.40శాతం వడ్డీ అందించనున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై డీఐసీజీసీ ఇన్సూరెన్స్ సదుపాయం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి



అల్పాహారం వడ్డిస్తున్న ఎంఈఓ

దుబ్బాకటౌన్: పదోతరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ దివ్య, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఎస్‌ఐ రఘుపతి అన్నారు. శనివారం రాయపోల్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 261 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారని, వారికి మార్చి 20 వరకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అల్పాహారం అందజేస్తారన్నారు. మధ్యాహ్న భోజనం వంట చేయడానికి కట్టెల పొయ్యి ఉండడంతో గమనించిన తహసీల్దార్ దివ్య, ఎస్‌ఐ రఘుపతి గ్యాస్ స్టవ్, రెండు సిలిండర్లు అందజేశారు. అనంతరం రాయపోల్ పోలీసులు విద్యార్థులతో వాలీబాల్ ఆడారు. హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సాహిత్య పరిషత్ 38వ వార్షికోత్సవం సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, సభ్యులు అశోక్ శనివారం తెలిపారు.

పద్మనాభస్వామి ఆలయం ముస్తాబు

- నేటి నుంచి ఉత్సవాలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్‌వద్ద వెలసిన అనంత మహాలక్ష్మి పద్మనాభస్వామి ఆలయం 24వ వార్షికోత్సవ ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం నుంచి ఉత్సవాలు 2వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరుగుతాయి. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ- పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సామూహిక లక్ష పుష్పార్చన, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 3న మాధవానంద సరస్వతి స్వామీజీతో పాటు పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, భక్తులకు అనుగ్రహ బాషణం నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.



ఆలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లు

దివ్యక్షేత్రం అనంత మహాలక్ష్మి ఆలయం



అనంతమహాలక్ష్మి ఆలయం దివ్యక్షేత్రం. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

– రాయిని అంబదాసు, ఆలయ బాధ్యుడు

మహిమగల తల్లి..



అనంత మహాలక్ష్మి అమ్మవారు చాల మహిమగల తల్లి. అమ్మవారిని కొలుచుకున్న వారికి సర్వసుఖాలు దక్కుతాయి. అనంతమహాలక్ష్మి పద్మనాభ స్వామి సమేతంగా వెలసిన గొప్ప ఆలయం.

– వేలేటి జయరామశర్మ, వేదపండితుడు

'అనంత' సాగర సరస్వతీ క్షేత్రంలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): వీణాపాణియై నిలుచున్న రెండో సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతూ భక్తుల విశేష పూజలు అందుకుంటోంది చిన్నకోడూరు మండలం అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం. ఈ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు ప్రతిభావంతులు అవుతారని భక్తుల విశ్వాసం. 3న సరస్వతీ మాత జన్మదినాన్ని (వసంత పంచమి) పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు 35వ వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సిద్దిపేటకు చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2న ఈ ఆలయానికి శంకుస్థాపన చేశారు.



సరస్వతీదేవి ఆలయం

ఆలయం పూర్తికావడానికి పదేళ్లు పట్టింది. 1990 జనవరి 1న నిల్చుని ఉన్న సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి సరస్వతీ మాత భక్తులకు ఆరాధ్య దైవంగా మారింది. ఈ ఉత్సవాలకు సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్లా జిల్లాలకు చెందిన వేల మంది భక్తులు తరలిరానున్నారు.




ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా శివమార్కండేయ జయంతి



ఉత్సవాల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు



ఆవాలతో మార్కండేయుని రూపం

గజ్వేల్‌రూరల్: శివమార్కండేయ జయంతి వేడుకలు శనివారం గజ్వేల్‌లో ఘనంగా జరిగాయి. శివ మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్‌లు గాడిపల్లి భాస్కర్, రాజమౌళిలు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం సభ్యులు పల్లకీలో శివమార్కండేయుని ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆవాలతో శివమార్కండేయుని రూపాన్ని రూపొందించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారాం, నాయకులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

- సీపీ అనురాధ
- 83 మంది పిల్లల రెస్క్యూ

సిద్దిపేటకమాన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీ అనురాధ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 83 మంది చిన్నారులను రెస్క్యూచేసి వారి తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించామన్నారు. వారితో పని చేయించుకుంటున్న యజమానులపై 17 కేసులు నమోదు చేశామని చెప్పారు. బడిఈడు పిల్లలు బడులలో ఉండే విధంగా అందరూ కృషిచేయాలని కోరారు. పిల్లలతో పనిచేయిస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిద్దిపేట డివిజన్‌లో45 మంది, గజ్వేల్ డివిజన్‌లో 29 మంది, హుస్నాబాద్ డివిజన్‌లో 9 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. బాల కార్మికుల గురించి సమాచారం ఉంటే 100కు కాల్ చేసి సమాచారం తెలపాలని కోరారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

కేసీఆర్ పట్టుకుంది కట్టె కాదు, కారు స్టీరింగ్

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కేసీఆర్ పట్టుకుంది కట్టె కాదని, కారు స్టీరింగ్ అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో పలువురికి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంభీరంగా అన్నీ గమనిస్తున్న కేసీఆర్ కొడితే మామూలుగా ఉండదు అనే మాటను సీఎం రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కేసీఆర్ దగ్గర ఓనమాలు నేర్చుకున్న రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై మాట్లాడే నైతికహక్కు లేదని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పథకాలను సమర్థవంతంగా అమలుచేసి తెలంగాణను సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దితే నేడు అందుకు భిన్నమైన పరిస్థితులు అలముకున్నాయని వాపోయారు. ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకువెళ్లి కాంగ్రెస్ భరతం పడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బెండె మధు, పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు ఊడెం కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం: సీఐ

మిషన్ భగీరథ ఏఈఈ ప్రవళిక

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్: విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సీఐ సైదా విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీటీమ్ విధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అలాగే అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని, సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు షీటీమ్ అధికారులు అవగాహన కల్పించారు. మహిళ రక్షణ చట్టాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ఫోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ కిషన్, సిబ్బంది మమత, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు వేలం

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు శనివారం వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. దేవదాయశాఖ పరిశీలకుడు శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో లడ్డు, పులిహోర ప్రసాదాలను విక్రయించుకునేందుకు పోగుల సంతోష్ యేడాదికి రూ.18 లక్షలకు హక్కులు పొందాడు. పూజాసామగ్రి, కొబ్బరి కాయలు అమ్ముకొనే హక్కులను పోగుల అనిత రూ.9,07,000లకు హక్కులు పొందినట్లు ఈఓ తెలిపారు.

అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ పార్టీనే..

- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బండజాతరలో ప్రత్యేక పూజలు

సిద్దిపేటరూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నా లేకున్నా లక్ష్మీనరసింహస్వామి బండక్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ పార్టీయే అని, రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసుకుందామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లూరులో జరుగుతున్న శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి బండజాతరలో చివరి రోజు ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు బండక్షేత్రంపై రూ.4కోట్లతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. రూ.35లక్షలతో సీసీ రోడ్డు, రూ.35లక్షలతో ఆలయ పునరుద్ధరణ, రూ.10లక్షలతో ఆలయం చుట్టూ షెడ్డు, రూ.80 లక్షలతో భగీరథ తాగునీటి పథకం, రూ 50లక్షలతో కల్యాణమండపం, రూ.20లక్షలతో పార్కు లాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ఆలయ చైర్మన్ కనకయ్య, మాజీ సర్పంచ్ నరేశ్, వంశపారంపర్య అర్చకులు రంగాచార్యులు, రామకృష్ణ, ఆలయ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

అలయ నిర్మాణానికి లక్ష సాయం

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని నంగనూరు మండలం వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయానికి హరీశ్‌రావు తనవంతు సాయంగా రూ.లక్ష విరాళం అందించారు. తన క్యాంపు కార్యాలయంలో గ్రామ నాయకులకు ఆ మొత్తాన్ని అందజేశారు. అంతకు ముందు బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన మల్లారెడ్డిని అభినందించారు. అనంతరం ఇటీవల పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన దంపతులు కనకయ్య, తార కుటుంబ సభ్యులను, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. అలాగే దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నీకి ఎంపికైన సిద్దిపేట క్రీడాకారులు హనుమాన్, లక్ష్మి మణికాంత్‌ను అభినందించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, సీనియర్ నాయకుడు భూపేష్, శ్రీకాంత్ రెడ్డి, మల్లయ్య, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు భగవాన్, సత్యం, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటజోన్: విరాళం అందజేస్తున్న హరీశ్‌రావు

రైతుల్లో సంతోషం

సిద్దిపేటరూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి రావడంతో రైతులు సంతోషంగా ఉన్నారని హరీశ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ పండగ ఉత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం నీళ్ళతో రంగనాయక సాగర్ ద్వారా పుష్కలంగా గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. ఆయనను ముదిరాజ్ సంఘం పెద్దలు ఘనంగా సన్మానించారు.

ఏ పథకం అమలైతలేదు సారూ..

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు అవడం లేదంటూ బండచెర్లపల్లి రైతులు హరీశ్‌రావుకు మొరపెట్టుకున్నారు. మండల పరిధిలోని పుల్లూరు బండ ఉత్సవాల్లో పాల్గొన్నా ఆయన బండచెర్లపల్లి వద్ద గ్రామస్తులతో ముచ్చటించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దశరథం తదితరులు ఉన్నారు.

మానవ సేవే.. మాధవ సేవే..

సిద్దిపేటకమాన్: మానవ సేవే.. మాధవ సేవగా ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించడం గొప్ప కార్యక్రమమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రావిచెట్టు హనుమాన్ దేవాలయ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పెషెంట్లు, వారి సహాయకులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముర్షద్ గడ్డ ఉత్సవాలల్లో భాగంగా హరీశ్‌రావు దర్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ చదువుల్లో రాణిస్తేనే..

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే.. ఉన్నత శిఖరాలకు చేరవచ్చని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి అన్నారు. పట్టణంలోని శనివారం రాత్రి నిర్వహించిన సెయింట్ జోసెఫ్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ కృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, హెచ్‌ఎం సుష్మ తదితరులు పాల్గొన్నారు.

◆ పోలీసుల తనిఖీలు

కోహెడరూరల్(హుస్నాబాద్): గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ కనకయ్య కోరారు. కోహెడ, తంగళ్లపల్లిలోని పలు దుకాణాలలో శనివారం నార్కొటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాత్కలిక ఆనందం కోసం యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పీఎస్ సిబ్బంది శంకర్, నవీన్‌కుమార్, తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు.

◆ వేసవిలో అందరికీ రక్షితనీరు

మద్దూరు(హుస్నాబాద్): వేసవిలో మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తామని, మిషన్ భగీరథ ఏఈఈ ప్రవళిక స్పష్టం చేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం గాగిల్లాపూర్, నారదాసు గుడిసెలు, నర్సాయపల్లి, పిట్టలగూడెంలోని రక్షిత నీటి సరఫరా వనరులను సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, భాస్కర్, మిషన్ భగీరథ లైన్‌మెన్‌లు, కరోబార్, పంపుమెన్‌లు పాల్గొన్నారు.

◆ చెక్కుల అందజేత

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లేశం, ఎండీ ఖాజా, మల్లేశం, యాదగిరి, దుర్గయ్య, నాగరాజు, శ్రీనివాస్, బాల్‌నర్సయ్య, వేణు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ జనుము విత్తనాల కొనుగోళ్లు

మద్దూరు(హుస్నాబాద్): ప్రసిద్ధ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో జనుము, మొక్కజొన్న విత్తనాలను కొనుగోళ్లు చేయనున్నారని మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్ చెప్పారు. నివారం దూల్మిట్టలోని రైతువేదికలో రైతుల నుంచి జనుము విత్తనాలు కొనుగోలు చేశారు. అఫ్రోజ్ మాట్లాడుతూ రైతులు అధిక ధర పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాధిక, సంస్థ ప్రతినిధులు ఈరన్న, కనకరాజు, మంజు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎంపీడీఓకు సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల నూతన ఎంపీడీఓగా ఎం.జయపాల్‌రెడ్డి, తహసీల్దార్‌గా మల్లికార్జున్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. వారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సన్మానించారు. ఆయన వెంట నాయకులు రవి, భిక్షపతి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

◆ హుండీ ఆదాయం రూ.3.95లక్షలు

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య సందర్భంగా అక్బర్‌పేటభూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,95,372 వచ్చినట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, పోలీస్ సిబ్బంది, తహసీల్దార్, ధర్మకర్తల సమక్షంలో ఆదాయాన్ని లెక్కించారు.

◆ హల్దీ వాగులోకి సాగర్ జలాలు

వర్గల్: రైతులకు సాగునీటిని అందించడం కోసం కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి శనివారం హల్దీవాగులోకి నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. సంగారెడ్డి కెనాల్ నీటిపారుదల శాఖ ఈఈ జితేందర్ మాట్లాడుతూ హల్దీ వాగులోని చెక్‌డ్యాంలు నింపడానికి సుమారుగా 0.65 టీఎంసీ నీరు అవసరం అవుతుందన్నారు. ప్రతిరోజు 500 క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ హాస్టల్‌ను ప్రారంభించాలని నిరసన

మద్దూరు(హుస్నాబాద్): మూతపడిన స్థానిక ఎస్సీ హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్ ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ ఈ హాస్టల్ మూతపడటంతో అనేక మంది పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరిగి ప్రారంభించాలన్నారు. నాయకులు రాహుల్, భరత్ కుమార్, రాకేశ్, అరవింద్, భరత్, చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు, చిట్యాల గ్రామాల మీదుగా బీటీ రోడ్డు రెన్యువల్ కోసం ప్రభుత్వం రూ.6.12 కోట్లు మంజూరు చేయడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి ఆధ్వర్యంలో తాడూరులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫ్లెక్సీకి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతోనే నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి చెప్పుల దండవేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్‌కృష్ణ, జయరెడ్డి, సంతోష్‌రెడ్డి, కళావతి, రాజేశ్వరి, యాదగిరి, భాను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ఎమ్మెల్యే పల్లా చిత్ర పటానికి చెప్పుల దండవేసి అవమానపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని తాడూరు బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు బంగారి సంపత్ పలువురు నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పరువుకు భంగం కలిగించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని చెప్పారు.



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శభాష్.. బాలబాలికలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఎండ్లబండి తయారీని చూసి ఎంఈఓ రంగనాయక్ మెచ్చుకున్నారు. పూర్వకాలంలో ప్రజలు ఎలా ప్రయాణించారు అనే ప్రాజెక్టులో భాగంగా వారు బంకమట్టితో ఎడ్ల బండిని తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వారిని ప్రశంసించారు. ఉపాధ్యాయులు మధుసూదనాచారి, వనిత, రమేశ్, సీఆర్పీలు లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ